# కొద్దికథలు

## మా తమ్ముడి తెలివి

మాయింట్లో యేపని చేయవలసి వచ్చినా నేనె చేసిపెట్టాలి. లేకపోతే పద్దుపడతాయి. ఒక్క మా యింటి పనులే కాదు యిరుగు పొరుగులవాళ్లకి కూడా బజారుపనులలో నేను సహాయ పడాలి. లేకపోతే మానాన్నగారు కోప్పడతారు. వుపకారమే కదుట్రా, ఆ మాత్రం సహాయంచేస్తే అరిగిపోతావా అంటారు, అందుకే నా చదువు కుంటు పడింది. అలాగంటే మా వాళ్ళు నమ్మరు. నీవు చదవకే నీపరీక్ష పోయిందంటారు.

అయితే మా నాన్నగారికి నామీద ప్రేమ లేకపోలేదు. అదంతా వూళ్ళో వాళ్ళ మెప్పుదలకి. మా నాన్నకి మా తమ్ముడంటే యెక్కువ ప్రేమ, అభిమానం. వాడంటే భయం కూడాను. ఒకనాడు యేం జరిగిందో తెలుసా!

ఆరోజు నేను గ్రెయిన్‌షాపుకి బియ్యంకోసం వెళ్ళేను. అప్పుడు నేను యింటిదగ్గర లేకపోయాను. మానాన్న జరూరుగా ఓ వుత్తరం వ్రాసి రిజష్టరీ చేసి రసీదు తీసుకురారా అని మా తమ్ముడి చేతికిచ్చి పంపేరు. ఆదద్దమ్మ తిన్నగా పోష్టాఫీసుకువెళ్ళి రైటరుచేతికి ఆ వుత్తరం యిచ్చేడు రిజిష్టరు చేయాలని. రైటరు ఆ వుత్తరం చూసి నాలుగణాల స్టాంపులు, తిరిగి కవరు యిచ్చి మా తమ్ముడిదగ్గర సొమ్ము తీసుకున్నాడుట. మావాడు అవి పట్టుకొని తిన్నగా మానాన్నగారి దగ్గరకు వచ్చేసాడు. మావాన్నవాడినిచూసి 'ఓరీ వెధవా! యింత జనరల్ నాలెడ్జి లేకపోతే ఎలాగ పనికివస్తావురా? అస్టాంపులు దానిమీద అంటించి యిస్తే రిజిష్టరుచేసినట్టు నీకు రసీదు యిస్తాడు. అది తీసుకురా' అని తిరిగి పంపేరు. యేం చేస్తాడు! మళ్ళా పోస్టాఫీసుకు పోయేడు. ఆ గుమాస్తా వీడిని చూసి యేం అబ్బాయి! బిళ్లలు అంటించమని యిస్తే యింతవరకు యెక్కడకు పోయేవు? యింత తెలివితక్కువ దద్దమ్మవి యే క్లాసు చదువుతున్నావని అడిగితే, స్కూల్‌ఫైనల్ చదువుతున్నానండీ అని. చెప్పుకోడానికేనా సిగ్గులేకపోయిందని నలుగురూ నవ్వేరంటే మీరుమాత్రం నవ్వరు. యింతకీ ఆ సమయంలో నేను యింటిదగ్గర లేకపోవడంచేత కథ యింతవరకూ వచ్చింది.

ఎస్. కామేశ్వరరావు.

* * *

## కేస్

గోవిందు పట్టి సోమరిపోతు. ఆపిల్లవాని తండ్రి మంచి ధనవంతుడు. పిల్లవానికేదో నాలుగు ముక్కలు వచ్చేటట్టు చేయాలని తండ్రి ఆశ. అయితే లక్ష్మియున్నచోట సరస్వతియుండదు. సరస్వతి యున్నచోట లక్ష్మియుండదు అనునది సార్థకమయింది గోవిందు విషయములో. పాఠశాలలో ఎప్పుడూ నిద్రపోయేవాడు గోవిందు. ఉపాధ్యాయుడు చెప్పు పాఠములను వినేవాడు కాదు. ఓనాడు D. E. O. వచ్చాడు యిన్‌స్పెక్షనుకు. ఇంగ్లీషు గ్రామరు యందు ప్రశ్నలు వేయమని D.E.O. చెప్పాడు ఉపాధ్యాయునికి. ఉపాధ్యాయుడు అందరి పిల్లవాండ్లను అడిగాడు. గోవిందును మాత్రము అడుగలేదు. ఎందుకనిన వాడు చెప్పలేడని తెలుసు ఉపాధ్యాయునికి. D. E. O. దీనిని గమనించి గోవిందుని లేపి "కేసు లెన్ని" (How many Cases are there) అని ప్రశ్న అడిగాడు. గోవిందు ఉన్నట్టుండి మూడు సార్! అని అన్నాడు. What are they ? అని అడిగాడు D. E. O; నామినేటివ్ కేస్, ఆబ్జెక్టివ్‌కేస్, మరియు సూట్‌కేస్ (Suit case) అని చెప్పాడు గోవిందు. కడపటిమాటతో D. E. O. కు పట్టలేని నవ్వొచ్చింది. ఉపాధ్యాయుడును, D. E. O. యున్ను కడుపుబ్బేటట్టు నవ్వారు. వారి నవ్వు ఇంతవరకు ఆగలేదంటే నమ్మండి

కె. సుబ్బారాయుడు.

* * *

## ఇష్టంలేని ఆహ్వానం

ఆవాళ ఆఫీసుపనిమీద విశాఖపట్టణం వెళ్లా. కాళ్లరిగేలా తిరగ్గా పని మూడురోజులకు పూర్తయింది. మొదటి రెండురోజులు కలిగిన బడలికచేత, క్రొత్తగా పూర్ణాలో లైలామజ్ను ఆడు